క్లుప్తంగా

గోపాల్‌పేట్ పాఠశాలలో ఎంపీపీ తనిఖీ

సారంగపూర్: మండలంలోని గోపాల్‌పేట్ ప్రాథమిక పాఠశాలను శనివారం ఎంపీపీ మహిపాల్‌రెడ్డి స్థానిక సర్పంచ్ సల్ల లింగవ్వతో కలిసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా మధ్యాహ్న భోజనం అమలుతీరు, నిర్వాహణ తీరును విద్యార్థులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందిస్తున్నారా, పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ గంగారెడ్డి, పాఠశాల సిబ్బంది, నాయకులు సల్ల సాయన్న ఉన్నారు.

మంత్రి అల్లోల పరామర్శ



శివారెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి

సారంగపూర్: మండలంలోని కొట్టె(బి) గ్రామానికి చెందిన పూండ్రు శివారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. అయితే శనివారం రాష్ట్రమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, కొట్టె(బి) పీఏసీఎస్ అధ్యక్షుడు అయిర నారాయణరెడ్డి, మండల కన్వీనర్ మాధవరావు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకులు..

లక్ష్మణచాంద: మండల కేంద్రానికి చెందిన పోతరాజు లింగన్న అనారోగ్యంతో, అలాగే శ్రీనివాస్ అనే యువకుడు దుబాయ్‌లో మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కూచాడి శ్రీహరిరావు శనివారం ఇరు కుటుంబాలను పరామర్శించారు. శ్రీనివాస్ కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయం అందచేశారు. నాయకులు ప్రతాప్‌రెడ్డి, అట్ల రాంరెడ్డి, ఈటెల శ్రీనివాస్, పొడెల్లి గణేష్ ఉన్నారు.

ఖానాపూర్: మండలంలోని రాజురా గ్రామానికి చెందిన మంగళపెల్లి రమేష్ కూతురు కొద్దిరోజుల క్రితం మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని పెంబి జెడ్పీటీసీ జానుబాయి పరామర్శించారు. బీజేపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు వివి.రమణారావు, నాయకులు గోపాల్‌రెడ్డి, లక్ష్మన్, భీమేష్, ధర్మరాజు, సాయి, మల్లేష్, భోజన్న ఉన్నారు.

లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మహిళలు

లోకేశ్వరం: మండలంలోని బాగాపూర్ గ్రామ శివారు ప్రాంతంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో శనివారం భక్తులు సామూహిక సత్యనారాయణ వ్రతాలను నిర్వహించారు. మృగశిర కార్తె ఆషాడ మాసంలో పంట చేలలో విత్తనాలు విత్తేముందు నియమనిష్టలతో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

దరఖాస్తుల పరిశీలన

సోన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయల లోన్ వెనుకబడిన తరగతుల్లో సంప్రదాయ, సంప్రదాయేతర కులాలకు చెందిన వారి నుంచి 528 దరఖాస్తులు మండలంలోని అన్ని గ్రామాల నుంచి వచ్చాయని శనివారం ఎంపీడీవో గడ్డం మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో కుల వృత్తులకు చెందిన 378, సంప్రదాయేతర కుల వృత్తులకు 150 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిశీలించి అర్హులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

చిన్నారుల ఇంటికి వెళ్లి.. బొట్టు పెట్టి



బొట్టు పెడుతున్న సూపర్‌వైజర్ శ్రీలత

కడెం: ఇంటింటికి వెళ్లి బొట్టు పెట్టి చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత కోరారు. మండలంలోని నర్సాపూర్ గ్రామంలో శనివారం అంగన్‌వాడీ కేంద్రంలో అడ్మిషన్ల కోసం స్థానిక అంగన్‌వాడీ టీచర్ భూపేందర్‌కౌర్‌తో కలిసి చిన్నారుల ఇంటింటికి వెళ్లారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతీ రోజు పౌష్టికాహారం అందించి ఆట పాటలతో ప్రీ స్కూల్ విద్యనందిస్తున్నామని తెలిపారు.

ప్రజాసంక్షేమానికి పెద్దపీట

ఖానాపూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేస్తూ దేశవ్యాప్తంగా అభివృద్ధి చేస్తోందని బీజేపీ నాయకురాలు, పెంబి జెడ్పీటీసీ జానుబాయి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరినాయక్ అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా శనివారం మండలంలోని రాజురా, కొత్తపేట్ గ్రామాల్లో వేర్వేరుగా నిర్వహించిన ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

తళుక్కుమనేలా.. స్కూల్ బ్యాగులు

- పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో డిమాండ్
- మార్కెట్లో వివిధ మోడళ్లు లభ్యం
- కొనుగోలుదారులతో సందడి
- విద్యార్థులను ఆకట్టుకునేలా తయారీ



దుకాణంలో వివిధ రకాల బ్యాగులు



కొనుగోలు చేస్తూ..



పరిశీలిస్తున్న విద్యార్థి తల్లి

నిర్మల్‌చైన్‌గేట్: సెలవులు ముగిశాయి. పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యాయి. విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్ తప్పనిసరి. వాటిని మోసేందుకు బ్యాగులు కూడా అవసరమే. మార్కెట్‌లో రకరకాల బ్యాగులు అందుబాటులో ఉన్నాయి. సూపర్ మ్యాన్, కార్టూన్ నెట్వర్క్, స్పైడర్ మ్యాన్, బార్బీడాల్, చోటాభీమ్ తదితర బొమ్మలున్నవి చిన్నారులను ఆకట్టుకుంటున్నాయి. త్రీడీ చిత్రాలతో కూడినవి, ఎక్కువ పుస్తకాలు పట్టేలా ట్రాలీ(వీల్) బ్యాగులు మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చాయి. పిల్లల అభిరుచికి తగ్గట్టుగానే వ్యాపారులు వివిధ సండే స్పెషల్ మోడళ్ల బ్యాగులను తీసుకొచ్చారు. కొనుగోలుదారులతో బ్యాగుల దుకాణాలు కళకళలాడుతున్నాయి.

ఆకర్షణీయమైన డిజైన్లలో..

ప్రైమరీ స్కూల్‌లో చదివే విద్యార్థి మొదలు కాలేజీలకు వెళ్లే విద్యార్థులకు అవసరమైన సైజుల్లో, ఆకర్షణీయమైన డిజైన్లలో బ్యాగులు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. నిర్మల్ బ్యాగ్ సెంటర్ల వినియోగదారులతో సందడిగా మారాయి. బాల బాలికలకు, చిన్నారులకు అవసరమైన బ్యాగులు లేటెస్ట్ డిజైన్లలో ఆకట్టుకుంటున్నాయి.

సైజును బట్టి ధర..

రకరకాల స్కూల్ బ్యాగులు వందల మోడళ్లలో మార్కెట్లో దర్శనమిస్తున్నాయి. వాటి సైజును బట్టి రూ.200 నుంచి రూ.2 వేల ధరలు పలుకుతున్నాయి. నర్సరీ నుంచి ఐదో తరగతి వరకు రూ.200 నుంచి రూ.500, పదో తరగతి వరకు రూ.800 రేటు ఉంది. పలు బ్రాండెడ్ కంపెనీలకు చెందిన బ్యాగులు కూడా లభిస్తున్నాయి. వీటి ధర దాదాపు రూ.1500 నుంచి రూ.2వేల వరకు ఉంది.

కొనుగోళ్లు పెరిగాయి..



స్కూల్ బ్యాగుల కొనుగోలు చేసేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు దుకాణాలకు బారులు తీరుతున్నారు. వారికి నచ్చే బ్యాగులు తెప్పించాం. ప్రస్తుతం కొనుగోళ్లు పెరిగాయి. అన్నీ రకాలు అందుబాటులో ఉన్నాయి.

– ఎండి కరీం జునైద్, వ్యాపారి

చాలా డిజైన్లలో ఉన్నాయి..



పిల్లలకు కావాల్సిన స్కూల్, క్యారేజ్ బ్యాగులు చాలా డిజైన్లలో ఉన్నాయి. బొమ్మలున్నవి ఆకట్టుకుంటున్నాయి. పెద్ద పట్టణాల్లో మాదిరిగానే నిర్మల్ లోనూ లభిస్తున్నాయి.

– మంజుల, కొనుగోలుదారు

బ్యాగులు ఆకట్టుకుంటున్నాయి



నర్సరీ మొదలుకొని కాలేజీ విద్యార్థులను సైతం ఆకట్టుకునే రకరకాల బ్యాగులు మార్కెట్లో దొరుకుతున్నాయి. గతంలో ఎప్పుడూ చూడని మోడళ్లు ఇప్పుడున్నాయి. ధరలు సైతం అందుబాటులోనే ఉన్నాయి.

– కవిత, కొనుగోలుదారు

బొమ్మలున్న వాటికి డిమాండ్



చిన్నారుల కోసమే అనేక డిజైన్లలో బొమ్మల బ్యాగులను తీసుకువచ్చి విక్రయిస్తున్నాం. వాటికి డిమాండ్ ఉంది. తల్లిదండ్రులు కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నారు. నాణ్యత ప్రమాణాలు సైతం పాటిస్తున్నాం.

–కిరణ్, వ్యాపారి

ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాకుండా ఎమ్మెల్యే కుట్ర



మాట్లాడుతున్న జెడ్పీటీసీ

ఖానాపూర్: నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్ పట్టణంలో విద్యార్థుల చిరకాల కోరిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాకుండా దశాబ్ద కాలంగా ఎమ్మెల్యే రేఖానాయక్ చేస్తున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని బీజేపీ నాయకురాలు, పెంబి జెడ్పీటీసీ జానుబాయి ఆరోపించారు. శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రెండు పర్యాయాలు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే ఇచ్చిన హామీని నెరవేర్చలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు మంజూరు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో ఖానాపూర్‌కు స్థానం లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. కేవలం ఎమ్మెల్యేకు చెందిన ప్రైవేట్ డిగ్రీ కళాశాలలను బలోపేతం చేయాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాకుండా ఎమ్మెల్యే చేస్తున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఖానాపూర్ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు, సదర్మాట్‌కు ప్రత్యేక కాలువ, డిగ్రీ కళాశాల ఏర్పాటు వంటి సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారన్నారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ ఈ ప్రాంతంలో నేటికీ అనేక సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయన్నారు.

26న పాఠశాలల బంద్

ఖానాపూర్: రాష్ట్ర వ్యాప్తంగా సర్కార్ పాఠశాలలను నిర్లక్ష్యం చేస్తూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ నెల 26న ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నిర్వహించతలపెట్టిన పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించి వాటిని బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం పాఠశాలలు ప్రారంభమై 20రోజులు కావస్తున్నా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ సేవలు విస్తరిస్తాం

కుంటాల: ప్రయాణికుల కోసం ఆర్టీసీ సేవలు మరింత విస్తరింపజేస్తామని ఆర్టీసీ సిబ్బంది శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం కుంటాలలో ఎంపీపీ అప్క గజ్జారాంయాదవ్ ఆధ్వర్యంలో శుభకార్యాల కోసం ఆర్టీసీ ప్రయాణికులకు కల్పించే రాయితీలపై వివరించారు. ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని కోరారు. ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్, వెంకట్ రావు, చిన్నన్ రావు, కృష్ణ, రమణారావు, గాండ్ల బాబు, భూమన్న పాల్గొన్నారు.

ప్రజలు ఉచిత న్యాయ సేవలు అందుకోవాలి



మాట్లాడుతున్న సివిల్ జడ్జి జితిన్ కుమార్

దస్తురాబాద్: ప్రజలకు ఉచిత న్యాయ సేవలు అందించేందుకు న్యాయవాదులు, న్యాయస్థానాలు కృషి చేస్తున్నాయని ఖానాపూర్ జూనియర్ సివిల్ జడ్జి జితిన్ కుమార్ సూచించారు. శనివారం మండలంలోని ఆకొండపేట, దేవునిగూడెం గ్రామాల్లో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశాక పేదరికంలో ఉన్న వారు కేసు వాదించేందుకు స్థోమత లేని వారు ఉచిత న్యాయ సేవల కోసం మండల లీగల్ సర్వీస్ కమిటీకి నేరుగా వచ్చి సంప్రదించినట్లయితే కేసు పూర్వ పరాలను పరిశీలించి ఉచిత న్యాయ సేవలు పొందవచ్చన్నారు. ఉచిత న్యాయ సేవలు జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో, దేశస్థాయిలో లభిస్తాయని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మద్యం తాగి వాహనాలు నడుపవద్దన్నారు. గ్రామ సర్పంచులు అంజన్న, పోషలింగం, ఎస్సై ప్రభాకర్‌రెడ్డి న్యాయవాదులు సురేష్, వెంకట్, రాజలింగం, శివకుమార్, ఆసిఫ్ అలీ, రాజశేఖర్ ఉన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలల నిర్వహణ

ఖానాపూర్: జిల్లా వ్యాప్తంగా నిబంధలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని లంబాడా హక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షుడు బి.గోవింద్‌నాయక్ డిమాండ్ చేశారు. శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కనీసం ఆటస్థలం లేకుండా మౌలిక వసతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా అనేక పాఠశాలలు నిర్వహిస్తున్నప్పటికీ పట్టించుకునే వారు కరువయ్యారని అన్నారు. నిబంధనలను ఉల్లఘించిన పాఠశాలలను తనిఖీ చేసి వాటి గుర్తింపును రద్దు చేయాలని, లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ప్రతిఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



సిగ్నల్స్‌ని పరిశీలిస్తున్న చైర్మన్, ట్రాఫిక్ ఎస్సై

నిర్మల్‌టౌన్: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, పోలీసులకు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ సూచించారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్, శివాజీచౌక్, జయశంకర్ సర్కిల్, మయూరి హోటల్, ఈద్గామ్ ప్రాంతాల్లోని ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద జరిగే ట్రాఫిక్ టైమార్స్ మిషన్స్ ఏర్పాటు పనులను శనివారం ట్రాఫిక్ ఎస్సై రావుల దేవేందర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ... జిల్లా కేంద్రం ఏర్పడిన తరువాత జనాభాతో పాటు వాహనాల పెరిగాయన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. తొందరపాటు సిగ్నల్స్ జంప్ చేయటం సరికాదన్నారు. చైర్మన్ వెంట పట్టణ కౌన్సిలర్ ఉన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులు పౌష్టికాహారం తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: క్షయవ్యాధిగ్రస్తులు పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన క్షయవ్యాధి లక్షణాల, చికిత్స, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. డాక్టర్ నాగేశ్వరరావు, ప్రియాంక, హెల్త్ సూపర్‌వైజర్ మతిన్, సీహో రమణ, టీబీ సూపర్‌వైజర్ రవికిరణ్ పాల్గొన్నారు.

తొలకరి పలకరింపుతో...



కుభీర్: తొలకరి జల్లులు కురువడంతో రైతులు పొలం బాట పట్టారు. సోయా, పత్తి విత్తనాలు నాటడంలో బిజీబిజీగా మారారు. ఏ పంట చేనులో చూసినా పత్తినాటే మహిళలే కనిపిస్తున్నారు. అరకరతో గుంటుక కొట్టే రైతులు, సోయా విత్తనాలు నాటుతున్న ట్రాక్టర్లే దర్శనమిస్తున్నారు.

వివేకానంద ఆవాసానికి బాలుడి అప్పగింత



బాలుడిని అప్పగిస్తున్న తండ్రి నరేందర్

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన గన్నవరం నరేందర్–లావణ్య దంపతుల కుమారుడు గన్నవరం నిహాల్(7), రెండో తరగతి చదువుతున్నారు. భైంసా పట్టణంలోని శ్రీవివేకానంద ఆవాసానికి తండ్రి అనుమతి మేరకు ఆవాస కేంద్ర అధ్యక్ష, కార్యదర్శులైన శైలేష్ మాశెట్టివార్, రంగు రవి, ఎల్మ లింగారెడ్డిలకు శనివారం అప్పగించారు. బాలుడి తల్లి రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించింది. అప్పటి నుండి తండ్రి నరేందర్‌కు కుమారుడి బాగోగులు చూడడం, చదివించడం ఇబ్బందిగా మారింది. దీంతో గ్రామానికి చెందిన ఉల్లెంగ ముత్యం, అర్జున్ ఠాకూర్‌ల సహాయంతో శుక్రవారం భైంసా ప్రభుత్వ ఆసుపత్రిలో బాలుడికి వైద్య పరీక్షలు నిర్వహించి ఆవాసానికి అప్పగించారు.

ఉత్తమ అవార్డు గ్రహీతలకు సన్మానం



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న కాలనీవాసులు

నిర్మల్‌రూరల్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్న మున్నూరు కాపు ఉద్యోగులను జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. తుల సంధ్యారాణి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా, భీమ ఉమా ఉత్తమ వైద్య ఉద్యోగిగా ఇటీవల మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. అవార్డు గ్రహీతలను శ్రీనగర్ కాలనీ మున్నూరు కాపు సంఘం, మున్నూరు కాపు మహిళా సంఘం ఆధ్వర్యంలో వేర్వేరుగా సన్మానించారు. మున్నూరు కాపు సంఘ అధ్యక్షులు ముడారపు పరమేశ్వర్ మాట్లాడుతూ మున్నూరు కాపు సంఘ ఉద్యోగులు అన్ని శాఖల్లో రాణించాలన్నారు. నాయకులు నాలం మదన్, గణేష్, భాస్కర్ శ్రీనివాస్, మహిళా సంఘ నాయకురాలు ఉషారాణి, వనజ, జ్యోత్స్న, కవిత ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్య



విద్యార్థులకు నోట్ బుక్కులు ఇస్తున్న సర్పంచ్

కుంటాల: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య సాధ్యమని పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. మండలంలోని ఓలా ఉర్దూ మీడియం పాఠశాలలో సర్పంచ్ కనీస్ ఫాతిమా, లింబా (కే) ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సతీష్ కుమార్‌లు విద్యార్థులకు శనివారం నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సునీల్ రెడ్డి, యూనిస్, జమీల్ హైమద్ పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు సన్మానం..

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఓలా ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సాజిద్ మిరాజ్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. మంత్రి ఐకె రెడ్డి, కలెక్టర్ వరుణ్ రెడ్డి, డీఈవో రవీందర్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. శనివారం సర్పంచ్ కనీస్ ఫాతిమా అతడిని సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల అదుపునకు కార్డెన్‌సెర్చ్



మాట్లాడుతున్న సీఐ వినోద్

లోకేశ్వరం: నేరాలను అదుపు చేయడానికి కార్డెన్ సెర్చ్‌లను నిర్వహిస్తున్నామని ముథోల్ సీఐ వినోద్ అన్నారు. శనివారం ఉదయం మండలంలోని నగర్ గ్రామంలో కార్డెన్ సెర్చ్‌ను (కమ్యూనిటీ అండ్ కాంటాక్టర్ ప్రోగ్రాం) పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం గ్రామంలోని రైస్‌మిల్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ వినోద్‌కుమార్ మాట్లాడారు. వాహన చోదకులు వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను అందుబాటు ఉంచుకోవాలన్నారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకున్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. 77 ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలు, నాలుగు కార్లను స్వాధీనం చేసుకుని జరిమానా విధించారు. కార్యక్రమంలో ఎస్సై సాయికుమార్, తానూర్, ముధోల్, బాసర ఎస్సైలు, పోలీసులు ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



రికార్డులు పరిశీలిస్తున్న సీఐ సైలు

కుంటాల: శాంతిభద్రతల పరిరక్షణకు తమవంతుగా కృషి చేయాలని భైంసా గ్రామీణ సీఐ సైలు పేర్కొన్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొట్టమొదటిసారిగా శనివారం కుంటాల పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించాలన్నారు. ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెంచాలని సూచించారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎస్సై హన్మాండ్లు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి



ఎస్సైకి వినతిపత్రం ఇస్తున్న ముదిరాజ్ కులస్తులు



లక్ష్మణచాంద: వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

తానూరు: ముదిరాజ్ కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఎస్సై విక్రమ్‌కు వినతిపత్రం అందించారు. టీవీ జర్నలిస్ట్ బండి అజయ్ ముదిరాజ్‌ను ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి కులం పేరుతో చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికావని, బండి ముదిరాజ్‌ను కిడ్నాప్ చేసి అతడి అనుచరులతో దాడి చేయించారని ఆరోపించారు. కౌశిక్‌రెడ్డిని ఎమ్మెల్సీ పదవీ నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ తాలూక నాయకులు ఆనంద్‌రావ్ పటేల్, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు పండరి, మాజీ సర్పంచ్ రాములు, పోశెట్టి, గణేశ్ లక్ష్మణ్, శ్యాం, ఆనంద్ ఉన్నారు.

తహసీల్దార్‌కు వినతి..

లక్ష్మణచాంద: ముదిరాజ్ సంఘం సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పాడి కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కవిత రెడ్డికి వినతి పత్రం అందచేశారు. ముదిరాజ్‌ల ఆత్మగౌరవాన్ని, మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడడం సరికాదన్నారు. లక్ష్మణచాంద ఉపసర్పంచ్ శ్రీనివాస్, సభ్యులు మహేందర్, రాజేశ్వర్, లింగన్న, గంగన్న, భీమేష్, రజినికాంత్, సక్కరి, అశోక్, రాజు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

దస్తురాబాద్: మండల కేంద్రానికి చెందిన జుంబర్తి శివ గతంలో ఓ దిన పత్రికలో జర్నలిస్టుగా సేవలందించాడు. అనారోగ్యంతో ఇటీవల మృతి శివ మృతిచెందగా అతడి కుటుంబాన్ని శనివారం మాజీ ఐఎస్ శర్మన్‌నాయక్ పరామర్శించి రూ.5000 అందించారు. మండల ఆటో యూనియన్ నాయకులు ఉన్నారు.